క్లుప్తంగా

చెరువుల పరిశీలన

మొగల్తూరు: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా చేపట్టిన చెరువు అభివృద్ధి పనులను శుక్రవారం అధికారుల బృందం పరిశీలించింది. మండలంలోని పేరుపాలెం నార్త్, రామన్నపాలెం, మొగల్తూరు, ముత్యాలపల్లి, వారతిప్ప గ్రామాల్లో తవ్విన చెరువులు పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ యు.రవిరాజు, వ్యవసాయ శాఖ ఏడీ ఇ.అనిల్ కుమారి, శాట్ డీఆర్‌పీ మహేష్, ఎంపీడీఓ ఆర్‌సీ ఆనంద్ కుమార్, ఏపీఓ వై.శ్రీనివాస్, ఈఓపీఆర్డీ నవీన్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల సమస్యలు పరిష్కరించాలి

మొగల్తూరు: గ్రామంలోని దళితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీవీరావు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మాపు సూర్య వరప్రసాదరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని పేరుపాలెంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేరుపాలెం గ్రామంలో దళితుల భూములను కొంత మంది ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారని, ఆ భూములను దళితులకు అందించాలన్నారు. అధికారులు చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు ఇంజేటి కుమార్ స్వామి, నాయకులు దేవ రాజేష్, గూడపాటి బాపనయ్య, గూడపాటి శ్రీకాంత్, పాలపర్తి గణేష్, పిడకాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై ఊరేగింపు

యలమంచిలి: కొంతేరు గ్రామంలోని శ్రీకుంతీ లక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక కల్యాణోత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామి వారిని గరుడ వాహనంపై గ్రామంలో ఊరేగించారు. ఆలయ అర్చకులు పూలపల్లి వేణునాథ్ ఆధ్వర్యంలో మంగళవాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో పండితులచే సదస్యం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా రాత్రి ఖండవల్లికి చెందిన శ్రీ నృత్యప్రియ డ్యాన్స్ అకాడమి నృత్యకారులతో కూచిపూడి నృత్య ప్రదర్శన చేయించారు. ఆదివారం ఉదయం స్వామివారికి చక్రస్నానం, రాత్రి పుష్పయాగం అనంతరం మహిళ భక్తులకు పసుపు, కుంకుమ, ప్రసాద వితరణ 11న నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి మామిడిశెట్టి వీర వెంకట శ్రీనివాస్ తెలిపారు.

ప్రజారోగ్యంపై అవగాహన పెంచాలి

నరసాపురం: ప్రజారోగ్యం విషయంలో ఆరోగ్య జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన పెంచాలని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో ఎస్‌డీజీ ప్రోగ్రామ్‌లో భాగంగా ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, హెల్త్ అసిస్టెంట్స్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎస్‌డీజీ ప్రోగ్రామ్‌లో భాగంగా 5 రకాలైన వైద్య సర్వేలను ఏఎన్‌ఎంలు చేయాల్సి ఉందన్నారు. ప్రతీరోజూ ఉదయం 8 గంటలు లోపుగా సర్వేలు పూర్తి చేయాలని చెప్పారు. రాబోయే వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని డెంగీ, మలేరియా జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఇంటి ఆవరణల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు సమన్వయంతో పని చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ మోహన, డాక్టర్ సోనీ పాల్గొన్నారు.

8న కుళాయి చెరువులో చేపలు పట్టేందుకు వేలం

నరసాపురం: జిల్లాలోనే అతిపెద్ద నరసాపురం కుళాయి చెరువులో 20 ఏళ్ల తరువాత చేపలు పడుతున్నారు. కుళాయి చెరువలో చేపలు పట్టుకోవడానికి హక్కులు కల్పించేందుకు ఈ నెల 8 మధ్యాహ్నం 3.30 గంటలకు మున్సిపల్‌కార్యాలయంలో బహిరంగవేలం నిర్వహిస్తోన్నట్టు కమిషనర్ కె.వెంకటేశ్వరరావు చెప్పారు. రూ 25 వేలు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనాలని కమిషనర్ చెప్పారు. 20 ఏళ్ల క్రితమే చెరువులో చేపల వేట రూ 3.50 లక్షలకు వెళ్లింది. ఇప్పుడు పాట ఎంతకు వెళ్తుందనే అంశంపై ఉత్కంఠ నెలకొంది.

ప్రేమించమంటూ యువతికి వేధింపులు

నరసాపురం: పట్టణంలోని బస్టాండ్‌రోడ్డులో గల ఓ కళాశాలలో జూనియయర్ ఇంటర్ చదువుతున్న ఓ విద్యార్థినిని స్థానిక పొన్నపల్లికి చెందిన కొప్పాడి దుర్గాప్రసాద్ కొంతకాలంలగా వేధిస్తుండడంతో కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్సై ప్రసాద్ చెప్పారు. దుర్గాప్రసాద్ యువతి వెంటపడుతూ తనను ప్రేమించాలని ఒత్తిడి చేస్తున్నాడు. ఫోన్‌లో మెసేజ్‌లు పెట్టి వేధిస్తున్నాడు. దీంతో యువతి పోలీసులను ఆశ్రయించింది. దుర్గాప్రసాద్‌తో పాటుగా అతనికి సహకరిస్తున్న మరో స్నేహితుడిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

వ్యక్తిని గాయపర్చిన ఆరుగురిపై కేసు

నరసాపురం: ఓ వ్యక్తిని కొట్టి గాయపరిచిన ఘటనలో ఆరుగురిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్టు టౌన్ ఎస్సై ప్రసాద్ చెప్పారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నరసాపురం మండలం సర్దుకొడప గ్రామానికి చెందిన ఒడుగు నరేంద్ర పట్టణంలోని ఓ బార్ వద్ద ఉండగా, పట్టణానికి చెందిన డి.సాయి మరో 5 గురు అకారణంగా నరేంద్రపై గొడవ పెట్టుకుని దాడిచేసి గాయపరిచారు. దీంతో బాధితుడు నరేంద్ర పోలీసులను ఆశ్రయించాడు.

అన్ని వర్గాలకు అండగా సీఎం జగన్



గడపగడపకూ మన ప్రభుత్వం అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: రాష్ట్రంలో అన్ని వర్గాలకు అండగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిలుస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శుక్రవారం తూర్పుపాలెంలో ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా పెనుమంట్ర మండలం జుత్తిగకు చెందిన లంకే పుల్లారావుకు రూ.22 లక్షలతో మంజూరు చేసిన ఫిష్ రవాణా వాహనాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలో సీఎం జగన్ అధికారం చేపట్టిన అనంతరం సచివాలయ వ్యవస్థ ద్వారా లక్షలాది మందికి ఉద్యోగాలు కల్పించారన్నారు. దీంతో పాటు వ్యాపార వర్గాల్లోనూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. వీటిని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పెనుగొండ ఏఎంసీ చైర్మన్ వెలగల వెంకటరమణ(మిస్సీ), ఎంపీపీ కేవీఎన్ నారాయణరెడ్డి(వాసు), జెడ్పీటీసీ సభ్యులు కర్రి గౌరీ సుభాషిణీ, గుంటూరి పెద్దిరాజు, జుత్తిగ సర్పంచ్ తమనంపూడి వీరా రెడ్డి, వైఎస్సార్ సీపీ సేవాదళ్ అధ్యక్షుడు జి సాయి మురళీ రెడ్డి, వ్యవసాయ సేవా మండలి ఛైర్మన్ కొవ్వూరి చిన్న, వైఎస్సార్ సీపీ నాయకులు కర్రి వేణు, కొవ్వూరి వేణుమాధవ రెడ్డి, బుర్రా రవికుమార్, మేడిచర్ల పండు, పిల్లి నాగన్నలు, మత్స్య శాఖ అభివృద్ధి అధికారి డి అశ్వని, గ్రామ మత్స్య శాఖ ఏఎంఈ సునీతలు పాల్గొన్నారు.

గడపగడపకూ మన ప్రభుత్వం పనులు సత్వరం పూర్తి చేయాలి

గడపగడపకూ మన ప్రభుత్వంలో భాగంగా సచివాలయాల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు సత్వ రం పూర్తి చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శుక్రవారం తూర్పుపాలెంలో అభివృద్ధి పనులుపై సమీక్ష నిర్వహించారు. ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు నలిమిల్లి వేణుప్రతాపరెడ్డి, పిల్లి నాగన్న, జక్కంశెట్టి చంటి, ఏఎంసీ వైస్ ఛైర్మన్ గుబ్బల వీరబ్రహ్మం, చెవ్వేటి రాజు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణోత్సవాలు



వేంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

నరసాపురం రూరల్: మండలంలోని యర్రంశెట్టివారిపాలెం ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆయల 14వ వార్షికోత్సవాన్ని పురస్కరిచుకుని స్వామివారికి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యర్రంశెట్టి బాబులు, ఆలయ ధర్మకర్త యర్రంశెట్టి వెంకట సూర్యనారాయణ, కూనపరెడ్డి పాండు, యర్రంశెట్టి బాబ్జి దంపతులు ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు శ్రీనివాసుల రమణాచారి, అగ్నిహోత్రం రామకృష్ణాచార్యులు స్వామివారిని అలంకరించిన తీరు భక్తులను అలరించింది. భక్తుల గోత్రనామాలతో పూజలు నిర్వహించారు.

కాజ స్లూయిజ్ తలుపులు బాగు చేయించాలి



యలమంచిలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

యలమంచిలి: వర్షాకాలంలో రైతులపాలిట దుఃఖదాయినిగా మారుతున్న కాజ అవుట్ ఫాల్ స్లూయిజ్ తలుపులను ఈ వేసవిలో బాగు చేయించాలని కాజ తూర్పు సర్పంచ్ పాలంకి శ్రీనివాసరావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ రావూరి వెంకటరమణ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో పాలంకి శ్రీనివాసరావు మాట్లాడుతూ అధిక వర్షాలు, గోదావరి వరదల సమయంలో ఏనుగువానిలంక-నవరసపురం సరిహద్దులో ఉన్న కాజ డ్రయిన్ అవుట్ ఫాల్ స్లూయిజ్ తలుపులు సక్రమంగా పని చేయకపోవడం వల్ల వేలాది ఎకరాల్లో పంటలు నీట మునుగుతున్నాయన్నారు. దీంతో యలమంచిలి మండలంలోని కొంతేరు, కాజ తూర్పు, కాజ పడమర, ఊటాడ, ఏనుగువానిలంక నరసాపురం మండలంలోని గొంది, చిన మామిడిపల్లి గ్రామాల్లోని రైతులు తీవ్రంగా నష్టపోతున్నట్లు ఆయన వివరించారు. ప్రస్తుత వేసవి కాలం పూర్తయ్యే లోపు స్లూయిజ్ తలుపులు బాగు చేసి రైతులకు మేలు చేయాలని ఆయన కోరారు. సమావేశంలో శాఖల వారీగా జరిగిన సమీక్షలో పంచాయతీరాజ్ ఏఈ వర్ధనపు శ్యాంబాబు మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం పథకంలో 58 పనులకు రూ.2.30 కోట్లు మంజూరు కాగా, రూ.1.60 విలువైన 40 పనులు పూర్తి చేసినట్లు వివరించారు. విద్యుత్ కోతలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఎలక్ట్రికల్ ఏఈ దున్న రాజీవ్ స్పందిస్తూ అధికారిక విద్యుత్ కోతలు లేవన్నారు. కానీ అధిక వేడి వల్ల విద్యుత్ వినియోగం పెరిగిపోవడంతో అర్ధరాత్రి సమయంలో ఫీడర్‌లపై ఓవర్‌లోడు పడుతుండుటతో విద్యుత్ సరఫర నిలుపుతున్నట్లు చెప్పారు. యలమంచిలి మండలంలోని యలమంచిలి, కాజ, ఇలపకుర్రు సబ్ స్టేషన్స్ పరిధిలోని ఫీడర్స్‌లో మామూలు సమయంలో 12 మెగావాట్ల విద్యుత్ వినియోగం ఉంటుందన్నారు. వాటి సామర్థ్యం 20 మెగా వాట్లు ఉందన్నారు. ప్రస్తుతం విద్యుత్ వినియోగం పెరగడంతో రాత్రి సమయంలో 18 నుంచి 19 మెగ వాట్ల విద్యుత్‌ను వినియోగిస్తున్నారన్నారు. దీంతో కండక్టర్స్ (విద్యుత్ తీగలు)పై అధిక భారం పడుతుందన్నారు. ఆ సమయంలో విద్యుత్ ఆపకపోతే వైర్లు తెగిపడే ప్రమాదం ఉందన్నారు. కనుకనే తప్పనిసరి పరిస్థితితుల్లో విద్యుత్ ఆపుతున్నట్లు ఆయన వివరించారు. ఒక్కోసారి అర్ధరాత్రి సమయంలో ఈదురు గాలులకు వైర్లు తెగిపోతుంటే విద్యుత్ సిబ్బంది తెల్లవార్లూ పనిచేసి విద్యుత్‌ను పునరుద్ధిస్తున్నారని, వారి కష్టాన్ని కూడా ప్రజలు గుర్తించాలని రాజీవ్ కోరారు. గృహనిర్మాణ శాఖ పనితీరుపై ఎంపీడీఓ త్రిశూలపాణి మాట్లాడుతూ 2019 నుంచి మన మండలంలో 2925 ఇళ్లు మంజూరు చేస్తే 1600 ఇళ్లు పూర్తయ్యాయన్నారు. మిగిలిన ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయన్నారు. అయితే మన మండలంలో 45 జగనన్న కాలనీ స్థలాలు ఇస్తే చాలా కాలనీల్లో ఇళ్ల నిర్మాణం ప్రారంభించలేదన్నారు. జగనన్న కాలనీలకు రోడ్లు, విద్యుత్, తాగునీరు సౌకర్యం కల్పించిన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ముందుకు రాకపోవడం పై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం జరిగేలా ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో ఎంపీపీ రావూరి వెంకటరమణ, మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షులు వల్లభు సాయి వెంకట నరసింహారావు, వైస్ ఎంపీపీలు గొల్లపల్లి శ్రీనివాసరావు, కొప్పాడి శ్రీనుబాబు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డయాలసిస్ రోగికి పింఛన్ అందజేత



కిడ్నీ రోగి బళ్ల రామకృష్ణకు నూతనంగా మంజూరైన రూ.10 వేలు పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

యలమంచిలి: మండలంలోని బాడవ గ్రామానికి చెందిన బళ్ల రామకృష్ణ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఇటీవల గ్రామంలో జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ ఆయన ఇంటికి వెళ్లినపుడు రామకృష్ణ తన గోడు చెప్పుకున్నాడు. కనీసం మందులకు కూడా డబ్బులు లేవని ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో కవురు శ్రీనివాస్ వెంటనే స్పందించి అక్కడి నుంచే అధికారులతో మాట్లాడి రామకృష్ణకు రూ.10 వేలు పింఛన్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు రామకృష్ణకు ఈ నెల నూతనంగా మంజూరైన రూ.10 వేల పింఛన్‌ను శుక్రవారం శ్రీనివాస్ చేతు మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం మానవులుగా మనందరి కనీస ధర్మమన్నారు. కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఇలపకుర్తి లక్ష్మి, ఏనుగువానిలంక సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ రావూరి రామకృష్ణ, వైఎస్సార్ సీపీ బాడవ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఇనుకొండ చిన్న వైఎస్సార్ సీపీ నాయకులు ఇలపకుర్తి నరసింహారావు (పండు), రావూరి వెంకట కోటి మురళీకృష్ణ (బుజ్జి), గవర చంద్రరావు, కూనా శ్రీను, గెల్లు గణపతి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



కోనసీమ జిల్లా అమలాపురంలో పింఛన్ అందిస్తున్న వలంటీరు

అమలాపురం వెళ్లి పింఛన్ అందజేత

పెనుగొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా వలంటీర్లు సేవలు అందించి ఆకట్టుకుంటున్నారు. మండుటెండలను సైతం లెక్క చేయకుండా ఇలపర్రు నుంచి కోనసీమ జిల్లా అమలాపురంలో కిమ్స్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకొంటున్న యాండ్ర సత్యనారాయణకు వలంటీరు నూకపెయ్యి ప్రకాష్ రాజ్ పింఛన్ అందించి నిబద్ధతను చాటుకున్నారు. ప్రకాష్ రాజ్‌ను పలువురు అభినందించారు.

సమగ్ర సర్వేతో భూముల పరిరక్షణ



కేపీ పాలెంలో డ్రోన్‌ల పనితీరును పరిశీలిస్తున్న అధికారులు



పెనుమంట్రలో మాట్లాడుతున్న తహసీల్దార్ అశోక్‌వర్మ

మొగల్తూరు: భూసర్వే నిమిత్తం ఉపయోగిస్తున్న డ్రోన్‌ల పనితీరును శుక్రవారం రెవెన్యూ అధికారులు పరిశీలించారు. మండలంలోని కేపీ పాలెం నార్త్‌లో చేపట్టిన భూ సర్వే పనుల కోసం డ్రోన్‌లను వినియోగిస్తున్నారు. భూ సర్వే కోసం ప్రప్రథమంగా డ్రోన్‌లను వినియోగిస్తున్నామని, అందుబాటులోకి వచ్చి న ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకుని, నిబంధనలకు అనుగుణంగా సర్వేను పక్కాగా చేపడుతున్నామని తహసీల్దార్ జి.అనిత కుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీ నరేష్, కేపీ పాలెం నార్త్, సౌత్ సర్పంచ్‌లు కడలి సోంబాబు, అందే వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు డీవీవీ సత్యనారాయణ, అందే ముక్తేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: సచివాలయ సిబ్బంది వీఆర్వోలు, సర్వేయర్లు సమన్వయంతో పనిచేసి సమగ్ర భూసర్వేను త్వరితగతిన పూర్తిచేయాలని తహసీల్దార్ అశోక్‌వర్మ అన్నారు. సమగ్ర భూసర్వేపై శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వేయర్లు రైతుల భూముల వద్దకు వెళ్లి వారి డాక్యుమెంట్లు ఆధారంగా సర్వే చేయాలన్నారు. వారి వద్దనుంచి భూ హక్కుదారుని ఫొటో ఆధార్‌కార్డు బ్యాంకు ఖాతా నంబర్ తీసుకోవాలని ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. డ్రోన్ సర్వే నివేదిక వచ్చే లోపుగా రీసర్వే నివేదిక అందజేయాలన్నారు. ప్రతీ రైతు వద్ద నుంచి ప్రస్తుతం ఉన్న సర్వే నంబర్ డాక్యుమెంట్‌లో ఉన్న సర్వే నంబర్ అసలైందో? కాదో? సరిచూసుకోవాలన్నారు. మళ్లీ సాగు మొదలయ్యేలోపుగా సర్వే పూర్తిచేయాలన్నారు. ఈ సందర్భంగా పలువురు సర్వేయర్లు వీఆర్వోలు అడిగిన సమస్యల పరిష్కారానికి ఆయన సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో పూర్ణబాబ్జి, వివిధ గ్రామాల వీర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు శ్రీకారం

పెనుగొండ: ఆచంటలో కోట్లాది రూపాయల వ్యయంతో చేపట్టబోయే అభివృద్ధి పనులకు శనివారం శ్రీకారం చుట్టు నున్నట్లు సర్పంచ్ కోట సరోజినీ వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తొలి విడతలో పెదపేటలోని ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.20 లక్షలు, కాపుల పాలెంలో కాపు కల్యాణ మండపానికి రూ.20 లక్షలు, కాపు శెట్టి బలిజ మండపానికి రూ.13 లక్షలు, ఎస్సీ కమ్యూనిటీ భవనానికి రూ.12 లక్షలు, దేవాంగుల కమ్యూనిటీ హాల్‌కు రూ.10 లక్షలు, నాయీ బ్రాహ్మ కమ్యూనటి హాల్‌కు రూ.10 లక్షలు, ఉప్పరి కమ్యూనిటీ హాల్‌కు రూ.10 లక్షలు, విశ్వ బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్‌కు రూ.10 లక్షలు, వెన్నపు వారి పాలెంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు రూ.5 లక్షలు మంజూరయ్యాయన్నారు. వీటికి శనివారం శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్‌లు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. నిధులు మంజూరు చేసి, గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. శంకుస్థాపన కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధి పనులు పెంచాలి

పెనుగొండ: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాల్లో ఉపాధి పనులు పెంచి వ్యవసాయ కార్మికులకు అండగా నిలవాలని పెనుగొండ ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం పెనుగొండ మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఉపాధి పనులతో వ్యవసాయ కార్మికులకు ఉపాధి కలగడమే కాకుండా, గ్రామాలను అభివృద్ధి బాటలోనూ నడిపించవచ్చునన్నారు. డ్వామా పీడీ ఎస్టీవీ రాజేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి పనులు అన్నీ పారదర్శకంగా నిర్వహించడానికి ప్రభుత్వం దిశా నిర్దేశం చేసిందన్నారు. ఉపాధి పనులతో వాణిజ్య పంటలను, పండ్ల తోటలను అభివృద్ధి పనులు చేసుకోనే విధంగా గ్రామాల్లో ప్రోత్సహించాలన్నారు. మండలంలో రూ.4.50 కోట్లు పనులు నిర్వహించినట్లు వివరించారు. వచ్చే ఏడాది మరిన్ని పనులు చేపట్టేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో డీబీఆర్ కృష్ణంరాజు, ఎస్ఆర్‌పీ పున్నపు నాయుడు, సాగర్, టీఏ కేవీవీఎస్ఎస్ శంకర్, పీఆర్ ఏఈ ఎన్ ఏడుకొండలు, హౌసింగ్ ఏఈ బి.లక్ష్మణరావులు పాల్గొన్నారు.

కుళాయి చెరువు గట్టు పనులకు అడ్డంకులు

- రోడ్డు పనులకు అభ్యంతరాలు తెలుపుతున్న ప్రతిపక్ష పార్టీల పెద్దలు
- దమ్మయ్యపతి మురుగుకోడుతో అసలు సమస్య
- కోతకు గురవుతున్న గట్టు



దమ్మయ్యపతి మురుగు కోడు వల్ల కోతకు గురవుతున్న కుళాయి చెరువు గట్టు నైరుతి ప్రాంతం

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు పట్టణంలోని మంచినీటి చెరువుకు పెనుముప్పు పొంచి ఉంది. పట్టణంలోని స్థానిక బ్రాడీపేట బైపాస్ రోడ్డుకు చేర్చి 1986లో సుమారు 33 ఎకరాల్లో తాగునీటి కుళాయి చెరువు ఏర్పాటు చేశారు. చెరువు చుట్టూ సీఫేజ్ (కుళాయి చెరువు లీకేజి వాటర్ కోసం ఏర్పాటు చేసింది) . స్థలం ఏర్పాటుచేయగా సుమారు 26 ఎకరాలు చెరువును తవ్వారు. చెరువుకు దక్షిణం భాగంలో దమ్మయ్యపతి మురుగుకోడు ఉంది. ఈ కోడులో పట్టణ ప్రాంతంలో సుమారు 15 వార్డుల మురుగు నీరు పారుదల అవుతుంది. రెండు కిలోమీటర్లు పొడవు ఉండే ఈ మురుగు కోడుకు డ్రెయిన్ నిర్మాణం చేపట్టాలని 2009లో అంచనాలు తయారు చేసి కొంతమేర పనులను చేపట్టారు.

20 శాతం కమీషన్ల గొడవతో ఆగిన పనులు

అరకొర పనులతో ఉన్న ఈ మురుగుకోడును 2014లో టీడీపీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మళ్లీ శంకుస్థాపనలు చేసి పనులను వేగవంతం చేశారు. అసలు సమస్య ఇక్కడి నుంచే ప్రారంభం అయ్యింది. విజయవాడకు చెందిన ఓ కాంట్రాక్టర్ దమ్మయ్యపతి డ్రెయినేజీ పనులు చేస్తున్నాడు. ఆ కాంట్రాక్టర్‌ని నాడు ఎమ్మెల్యే 20 శాతం కమీషన్లు అడిగారని తాను అంత ఇచ్చుకోలేనని చెప్పాడు. దాంతో కాంట్రాక్టర్ బిల్లులు మంజూరు కాకుండా ఎమ్మెల్యే అడ్డుకున్నట్లు అప్పట్లో అనేక ఆరోపణలు వచ్చాయి. దానితో తాను పనులు చేయలేనని కాంట్రాక్టర్ సకాలంలో దమ్మయ్యపతి మురుగుకోడు పనులను నిలుపుదల చేశారు. అప్పట్లో ఎమ్మెల్యేపై ఆ కాంట్రాక్టర్ కేసులు కూడా పెట్టిన సందర్భాలు ఉన్నాయి. దానివల్ల దమ్మయ్యపతి డ్రెయినేజీ పనులు నేటికి పూర్తి కాలేదు



గూగుల్ మ్యాప్‌లో స్పష్టంగా కనిపిస్తున్న కోతకు గురవుతున్న కుళాయి చెరువు గట్టు ప్రాంతం

కోతకు గురవుతున్న కుళాయి చెరువు

ఇప్పటి వరకూ దమ్మయ్యపతి మురుగు కోడుపై డ్రెయినేజీ పనులు అక్కడక్కడా పూర్తి సగం నిర్మాణంతో ఆగిపోవడం వల్ల కుళాయి చెరువుగట్టుకు శరాఘాతంగా మారింది. కొంత భాగం వరకూ కట్టిన డ్రెయినేజీ పనులు కుళాయి చెరువు గట్టుకు దక్షిణం వైపున నైరుతి మూల వరకూ చేసి ఆపేశారు. ఇప్పుడు అక్కడి నుంచి మురుగు నీరు పారుదల అవుతూ కుళాయి చెరువుగట్టున నైరుతి మూల కోతకు గురి చేసింది. చిత్రం ఏంటంటే సీ ఫేజ్ స్థలం అంతా కోతకు గురై చెరువు గట్టు వరకూ చేరుకుంది. గూగుల్ మ్యాప్‌లో కూడా కోతకు గురైనట్లు స్పష్టంగా కనిపిస్తుంది.

పనులకు అడ్డుపడుతున్న ప్రతిపక్షాలు

కుళాయి చెరువుకు సెక్యూరిటీ ఏర్పాటు చేయాలంటే చెరువుకు పడమర వైపున రోడ్డు ఏర్పాటు చేయాలి. ఈ రోడ్డులో మునిసిపల్ రిజర్వ్ సైటు ఉంది. ఆ సైటు వరకూ సీసీ రోడ్డు నిర్మాణం జరిగి ఉంది. అక్కడి నుంచి మునిసిపల్ రిజర్వ్ సైటు మీదుగా దమ్మయ్యపతి మురుగు కోడు డ్రెయినేజీ వరకూ రోడ్డు ఏర్పాటు చేసి అక్కడి నుంచి కోతకు గురవుతున్న ప్రాంతాన్ని పూడ్చాల్సి ఉంది. అందువల్ల మునిసిపల్ అధికారులు తాత్కాలిక గ్రావెల్ రోడ్డును ఏర్పాటు చేస్తుండగా స్థానిక టీడీపీ, జనసేనలకు చెందిన కొందరు బడా నాయకులు అడ్డు చెబుతున్నట్లు సమాచారం. ఇక్కడ రోడ్డు ఎందుకు ఏర్పాటు చేస్తున్నారని అధికారులను ప్రశ్నించినట్లు తెలిసింది. అసలు విషయం ఏమిటంటే ఇక్కడ రోడ్డు నిర్మాణం చేస్తే దమ్మయ్యపతి మురుగుకోడు అవతల ఉన్న స్లమ్ ఏరియా ప్రజలకు ఇటు వైపుగా మార్గం ఏర్పడుతుందనే సాకుతో అధికారులను అడ్డుకున్నట్లు సమాచారం. ఒక వేళ చెరువు కోతకు గురై ఏదైనా ప్రమాదం జరిగి ప్రజలకు తాగునీరు లేకపోయినా పరవాలేదు కాని మా అంతస్థుల వైపు స్లమ్ ఏరియా జనం రాకూడదంటూ అధికారులపై పెత్తనం చలాయించడం ఆశ్చర్యకరంగా ఉంది. దాంతో అధికారులు సైతం పనులు సకాలంలో వదిలేసినట్లు తెలిసింది.

యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభిస్తాం

కుళాయి చెరువుగట్టు నైరుతి మూలలో కోతకు గురైన ప్రాంతాన్ని గుర్తించాం. అది పూడ్చడానికి వాహనాలు వెళ్లే మార్గం లేకపోవడంతో మునిసిపల్ రిజర్వ్ సైటు నుంచి రోడ్డు ఏర్పాటు చేస్తున్నాం. రోడ్డు ఎందుకు వేస్తున్నారని కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. వారికి సమస్యను తెలియజేశాం. వచ్చేది వర్షాకాలం కావడంతో వారం రోజుల్లో యుద్ధ ప్రాతిపదికన కుళాయి చెరువు కోతకు గురైన ప్రాంతంలో పనులు పూర్తి చేస్తాం. – టీఆర్ఎస్ శేషాద్రి, మునిసిపల్ కమిషనర్, పాలకొల్లు